క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజలు


సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో వేంజేసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం


జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు శ్రీకాంతాచార్యులు తదితరులు కల్యాణం నిర్వహించారు.

వెంకన్న ఆలయంలో శాంతి హోమం


శాంతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శాంతి హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని మండపంలోని హోమ గుండం వద్ద చక్రపెరుమాళ్లను అధిష్టంపజేశారు. ఆలయ అర్చకుడు భార్గవ్ తదితరులు విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం,మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు.

ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కార్మికులు చేస్తున్న ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 929వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన టీపీపీ, పీఈఎం, ఆర్‌ఈడీ, ఎస్ఎండీ, స్టోర్స్ తదితర విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. కర్మాగారాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ఉద్యమాలకు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి పవిత్రాల సమర్పణ

ఎంవీపీ కాలనీ: శ్రీవేంకటేశ్వరస్వామికి పవిత్రాల సమర్పణ కార్యక్రమం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో రెండు రోజులుగా పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. విశాఖ కార్తీక దీపోత్సవం టీమ్, వైదిక విపంచి, శ్రీవారి సేవ టీమ్, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పవిత్రోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు.

తెలుగుభాషకు గొడుగు... గిడుగు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం


తెలుగు తల్లి వేషధారణలో విద్యార్థినులు


గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి నరసింహం తదితరులు

సింహాచలం: తెలుగుభాషకు గొడుగుగా వ్యవహరించిన గిడుగు రామ్మూర్తి పంతులు చిరస్మరణీయులని అడవివరం గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం అన్నారు. అడవివరం గ్రంథాలయంలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి నరసింహం పూలమాలవేసి నివాళులర్పించారు. తెలుగు భాషకు వన్నె తెచ్చిన మహోన్నతుడు గిడుగు రామ్మూర్తి పంతులని కొనియాడారు. తెలుగుభాష వాడుకను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పి.వి.రమణ, సింహాచలం దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు వెలగపూడి వేణు,కార్మిక నేత సీహెచ్. సూర్యనారాయణ రాజు, గ్రంథాలయ ఉద్యోగిని ఎల్లమ్మ, పాఠకులు భానుమూర్తి, హరీశ్, మనూష, శంకర్ పాల్గొన్నారు.

- పెందుర్తిశాఖా గ్రంథాలయంలో మంగళవారం తెలుగు భాష ఉద్యమకారుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి సూర్యకళ, పాఠకులు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.
- పెందుర్తి శ్రీచైతన్య పాఠశాలలో రామ్మూర్తి పంతులు చిత్రపటానికి ప్రిన్సిపాల్ పి.తారకేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే క్రీడాకారుడు ధ్యాన్ చంద్ పుట్టిన రోజుపురస్కరించుకుని క్రీడాదినోత్సవ వేడుకలను కూడా నిర్వహించారు. పాఠశాల ఉత్తరాంధ్ర ఏజీఎం ఎం.వి.సురేష్, రీజనల్ ఇన్‌చార్జి మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న వేషధారణల్లో విద్యార్థులు

పరవాడ: మండలంలోని పి.బోనంగి గ్రామంలోని సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో తెలుగు భాష దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి ముందుగా తెలుగు తల్లికి జ్యోతి ప్రజ్వలన చేశారు. తెలుగు భాష గొప్పతనాన్ని పాఠశాల విద్యార్థులు గేయ, పద్య, నాట్య, కథ, కవిత, నాటక రూపంలో ప్రదర్శించారు. తెలుగు ధనాన్ని గౌరవిద్దాం, వెలుగు ధనాన్ని స్వాగతిద్దాం అంటూ తెలుగు భాషను కీర్తించారు.


సంప్రదాయ వస్త్రధారణలో డీఎస్ఎన్ఎల్‌యూ విద్యార్థులు, వీసీ ఆచార్య శ్రీసుధ

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

సబ్బవరం: మండలంలోని పలు విద్యాలయాల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ)లో తెలుగు భాషా దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. పలు సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు వీసీ డాక్టర్ ఆచార్య శ్రీసుధ బహుమతులు అందజేశారు.విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో హాజరయ్యారు.

- స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్జేడీ డాక్టర్ ఎస్. శోభారాణి తెలుగు భాష గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి, తెలుగు అధ్యాపకుడు డాక్టర్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ బి. శంకర్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.
- సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎస్. తిరుపతిరావు ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం, క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు, హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థినులు


వివిధ వేషధారణల్లో విద్యార్థులు


మాట్లాడుతున్న ఆర్జేడీ డాక్టర్ శోభారాణి


నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం తిరుపతిరావు

అభివృద్ధి పనుల పరిశీలన


రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెంలో రూ.18.17లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను మంగళవారం కార్పొరేటర్ ముమ్మన దేముడు జీవీఎంసీ అధికారులతో పరిశీలించారు. రోడ్లు నాణ్యంగా వేశారా లేదాఅన్న విషయంపై పరిశీలన జరిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ దుర్గాప్రసాద్, వర్కు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు రోమాల నూకరాజు, కేవీఆర్.లక్ష్మి, చిన్నంనాయుడు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


కబీ బొండ బాన్ (ఫైల్)

పరవాడ: దేశపాత్రునిపాలెం ఆర్‌ఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ వ్యక్తి ఒడిశా ప్రాంతానికి కబీ బొండా బాన్ (36)గా గుర్తించామని సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. మృతుడు భార్య, ఇద్దరు పిల్లలతో దేశపాత్రునిపాలెం దరి ఆర్.ఆర్.నగర్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్యలో బాన్ ఇంట్లో పడక గదిలో ఇన్‌సైడ్ బోల్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి ఆత్మహత్యకు కుటుంబ తగాదాలే కారణమని చెప్పారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించి కేసు నమోదు దర్యాప్తు జరుపుతున్నామని సీఐ చెప్పారు.

రోడ్డు శిథిలంతో ఇబ్బందులు


అధ్వానంగా మారిన రహదారి

పరవాడ: గాజువాక-యలమంచిలి రహదారి పరవాడ పైడిమాంబ ఆలయం వద్ద అధ్వానంగా మారింది. దీంతో ప్రయాణికులు, వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. ఏ మాత్రం వర్షం కురిసినా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వర్షపు నీరు రోడ్డు మధ్యలో మోకాలి లోతు వరకూ నిలిచిపోతుంది. మరో వైపు నిత్యం రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో గుంతలమయంగా మారింది. భారీ గుంతల్లో పడడం వలన వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. వాహనాలు అదుపుతప్పి ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. లోతట్టు ప్రాంతాన్ని ఎత్తు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలె వాపోతున్నారు. ఈ రహదారిలో ఎన్టీపీసీ, జిందాల్, ఎస్ఈజెడ్ పరిశ్రమలకు భారీ వాహనాలతో పాటు నిత్యం వేల సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు, అనేక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. మండల సర్వసభ్య సమావేశంలో ఈ విషయాన్ని సభ్యులు ప్రస్తావించినా ఆర్అండ్‌బీ అధికారులకు స్పందించలేదని వాపోతున్నారు.

స్కేటింగ్‌లో సత్తాచాటుతున్న సాయిసాహితి


సాయిసాహితి

విశాఖ స్పోర్ట్స్ : నగరానికి చెందిన సాయిసాహితి స్కేటింగ్ పోటీల్లో సత్తాచాటుతోంది. ఇటీవల ఆస్ట్రేలియాలో జరిగిన పసిఫిక్ కప్ ఇన్‌లైన్ ఫ్రీస్కేటింగ్ బాలికల విభాగంలో సాయిసాహితి ద్వితీయ స్థానంలో నిలవగా...ఫ్రీ స్కేటింగ్ బాలికల విభాగంలో తృతీయస్థానంలో నిలిచింది. ఫిగర్ స్కేటింగ్ ఓవరాల్‌లో సాయి సాహితి తృతీయస్థానంలో నిలిచింది. ఇప్పటివరకు పన్నెండేళ్ల ప్రాయంలోనే పలు జాతీయస్థాయి పోటీలతో పాటు అంతర్జాతీయ పోటీల్లోనూ తలపడి ఆర్టిస్టిక్ విభాగంలో పలు పతకాలను సొంతం చేసుకుంది. వరల్డ్‌స్కేట్ ఓషియేనియా ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో ఆస్ట్రేలియా,న్యూజిలాండ్, బ్రెజిల్, భారత్, జపాన్, చైనీస్ తైపెయ్, యూఎస్ఏ స్కేటర్లు జట్లు పాల్గొన్నాయి.

విద్యార్థి దశ నుంచే దేశభక్తి అలవర్చుకోవాలి


విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి తదితరులు

ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: విద్యార్థి దశ నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు.మండలంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంగళవారం నా భూమి-నా దేశం కార్యక్రమంలో భాగంగా భారీ అవగాన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో భారత సైనిక దళాలల్లో సేవలందిస్తున్న జవాన్లను ఘనంగా సన్మానించడం జరుగుతుందన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వ్యాసరచన,వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, తరాక ప్రసాద్, వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, ఎంపీడీవో రమేష్ నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్,వైస్ ప్రిన్సిపాల్ పీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో కృషి చేస్తే విజయం సాధ్యం


మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

కొమ్మాది: మనలోని బలం, బలహీనతలను తెలుసుకుని ఒక ప్రణాళిక ప్రకారం కృషి చేస్తేనే విజయం సాధ్యమవుతుందని కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. కొమ్మాదిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం విద్యాలయ నిర్వాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అందుబాటులో ఉన్న అన్ని సౌకర్యాలను వినియోగించుకుంటేనే విద్యార్థులు ఉన్నత స్థానాలు చేరుకోగలరన్నారు. విద్యాలయానికి రెండు బోరు బావులు, 4 తరగతి గదులు, పది కంప్యూటర్లు, పార్ట్‌టైమ్ డాక్టర్ సదుపాయం కల్పించడంతో పాటు స్టాఫ్ క్వార్టర్స్, రోడ్ల మరమత్తులు చేయడానికి వీలుగా సీపీడబ్ల్యూడీకి సిఫార్సు చేయనున్నట్టు తెలిపారు. తాను కడప జిల్లాలో నవోదయ విద్యాలయంలో చదువుకున్నానని, వైద్య వృత్తి అనంతరం సివిల్స్‌కు ఎంపికైనట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నవోదయ ప్రిన్సిపాల్ కె.సంజయ్, విశాఖ వ్యాలీ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్, అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ స్టార్టప్ సెంటర్ సందర్శన


మొక్క నాటుతున్న అధికారులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్‌ను లెఫ్టినెంట్ జనరల్ ఎన్.ఎస్.రాజ సుబ్రమణి మంగళవారం సందర్శించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి విచ్చేసిన ఆయన ఏయూలో విద్యార్థులకు స్టార్టప్ రంగంలో అందిస్తున్న ప్రోత్సాహం, విద్యార్థుల ఆవిష్కరణలు ప్రత్యక్షంగా పరిశీలించారు. భారత్ ఆర్థికంగా పటిష్టం కావడానికి స్టార్టప్‌లు ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. ఈ సందర్భంగా ఆ హబ్‌లో యువత ఏర్పాటు చేసిన వివిధ సంస్థలు పనిచేస్తున్న విధానం ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఏయూ ఆ హబ్‌లో చేపట్టే కార్యక్రమాల్లో తాము ప్రత్యక్షంగా భాగమవుతామన్నారు. ఈ సందర్భంగా ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియం ఆవరణలో మొక్కనాటారు. ముందుగా రాజ సుబ్రమణి ఏయూ పరిపాలనా భవనాన్ని సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి స్వయంగా సుబ్రమణిని ఆహ్వానించారు. ఏయూ క్యాంపస్ కళాశాలల ప్రిన్సిపాళ్లను పరిచయం చేశారు. ఏయూలో గత నాలుగు సంవత్సరాల కాలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, నూతన ప్రాజెక్టులను వివరించారు.

ఘనంగా ఓనం వేడుకలు


కేరళ సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు

సబ్బవరం: సబ్బవరంలోని బ్రిడ్జిటైన్స్ పాఠశాలలో ఓనం పర్వదినం,తెలుగు భాషా దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎలిసా, ప్రిన్సిపాల్ పునీత ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేరళ సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఆకట్టుకున్నారు.

ఊపందుకున్న ప్రచారం


యునైటెడ్ ఫ్రంట్ నిర్వహించిన సభలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు


నేషనల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: భెల్ గుర్తింపు సంఘం ఎన్నికలు దగ్గర పడడంతో యూనియన్ల ప్రచారం ఊపందుకుంది. ఈ నెల 31వ తేదీన జరిగే ఎన్నికల సందర్భంగా సంస్థ ప్రధాన గేటు ఎదురుగా మంగళవారం ప్రోగ్రెసివ్ ఫ్రంట్ బలపర్చిన బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయిస్ యూనియన్ నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయిస్ యూనియన్‌తోనే కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ ప్యానెల్‌లో వైఎస్సార్‌టీయూసీతో భాగస్వామ్యం కలిగి ఐఎన్‌టీయూసీ, సీఐటీయూతో పాటు ఏఐసీటీయూ సమర్థవంతమైన నాయకత్వం కలిగిన యూనియన్లు ఉన్నాయన్నారు. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అభ్యర్థులు జి.టి.పి.ప్రకాష్, ఉరుకూటి బాబూరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇంటక్ అఖిల భారత్ కార్యదర్శి మంత్రి రాజశేఖర్, వైఎస్సార్‌టీయూసీ స్టీల్‌ప్లాంట్ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, భెల్ ఇంటక్ నాయకులు ఎం.ఎ.రెహమాన్, చీఫ్ పేట్రన్స్ దామోదర్ రెడ్డి, ఎస్.జ్యోతీశ్వరరావు, ఇంటక్ నాయకుడు నాగభూషణం, స్టీల్‌ప్లాంట్ సిటూ అధ్యక్షుడు జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, ఎన్.వి.ఎన్.ఆర్.పట్నాయక్, పి.ఆనందకుమార్, వారాడ ఆనందరావు, సీహెచ్.సీతంనాయుడు, వైఎస్సార్‌టీయూసీ నాయకులు రోమాల అప్పారావు, ఎన్.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తమ యూనియన్‌ను గెలిపిస్తే భెల్‌లో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని భెల్ జేఎస్‌సీ మెంబర్ ఎస్.డి.వి.కృష్ణంరాజు అన్నారు. మంగళవారం యునైటెడ్ ఫ్రంట్ (ఏఐటీయూసీ) నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అభ్యర్థులు బొండా బాబూరావు, సుభాకర్ సాహూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు కొల్లి దేముడు, పి.వి.ఎస్.రాజు, సీహెచ్.ఎస్.ఎన్.రాజు, ఎ.వెంకటేశ్వరరావు, ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ జీతాలు చెల్లించాలని వినతి


జెడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గాజువాక : గత జూన్ నెలలో మిస్ అయిన తమ జీతాలను ఇప్పించాలని కోరుతూ 68, 69 వార్డుల పారిశుధ్య కార్మికులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నాతయ్యపాలెం నుంచి ర్యాలీగా వచ్చి గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలంకు వినతి పత్రం అందజేశారు. జూన్‌లో తమ జీతాలు మిస్ అయ్యాయని, దీనిపై అనేకసార్లు అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని వివరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, ఎ.లోకేష్, ఎం.రాంబాబు, నక్క నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు క్రీడాకారులకు పతకాలు


కె.ఆదినారాయణ


ఎం.భాస్కరరావు

పెదగంట్యాడ: ఈ నెల 25 నుంచి 27 వరకు ఛత్తీస్‌ఘడ్‌లోని భిలాయ్ నగర్‌లో సెక్టార్-6 ఖాళీ బడి భవన్‌లో నిర్వహించిన 29వ జాతీయ క్రీడా పోటీల్లో పెదగంట్యాడకు చెందిన ఇద్దరు ఉక్కు క్రీడాకారులు సత్తా చాటి, పతకాలు దక్కించుకున్నారు. పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్-2023 పోటీలలో మొత్తం 300 మంది క్రీడాకారులు హాజరు కాగా.. స్టీల్‌ప్లాంట్ నీటి సరఫరా విభాగానికి చెందిన కె.ఆదినారాయణ బెంచ్ ప్రెస్‌లో రజత పతకం, డెడ్ లిఫ్ట్‌లో బంగారు పతకం కైవసం చేసుకున్నారు.

అదే విభాగానికి చెందిన ఎం.భాస్కరరావు బెంచ్ ప్రెస్‌లో కాంస్య పతకాన్ని సాధించారు. వీరికి అక్కడి రిఫరీ రాజ్ మహవీర్ సింగ్ పతకాలు అందజేసి అభినందించారు. గాజువాక చేరుకున్న వీరికి స్థానిక క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

రైల్వే ఉద్యోగి మృతి

సీతమ్మధార: రైల్వే ఉద్యోగి మృతి చెందిన సంఘటన ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే సీనియర్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్‌గా కె.వేంకటేశ్వరావు పనిచేస్తున్నారు. ఏవీఎన్ కళాశాల సమీపంలో డెంకాడ వీధిలో నివాసముంటున్నారు. భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఫిర్యాదు రావడంతో వేంకటేశ్వరరావుతోపాటు మరో ఉద్యోగి వెళుతున్నారు. మార్గ మధ్యలో సమస్య పరిష్కారం అయిందని ఫోన్ రావడంతో తిరిగి ఆఫీసుకు చేరుకున్నారు. బైక్ స్టాండ్ వేస్తున్న సమయంలో వేంకటేశ్వరరావు వెనక్కు పడిపోయాడు. వెంటనే తోటి ఉద్యోగి రైల్వే ఆస్పత్రికి తీసుకువెళ్లేసరికి అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కుమారుడు వెంకట పృథ్వీ ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.